ప్రజాశక్తి
గురువారం 3 ఏప్రిల్ 2025 5
శ్రీ సత్యసాయి



గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా జెసి బాధ్యతల స్వీకరణ



జెసికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గ్రంథాలయ సంస్థ సెక్రటరీ రమ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ బాధ్యతలను బుధవారం స్వీకరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థలకు సంబంధించిన వ్యవహారాలను నిర్వహించడానికి జిల్లాల జాయింట్ కలెక్టర్‌లను పర్సన్-ఇన్‌ఛార్జులుగా నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయం సంస్థ అభివద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్‌ను గ్రంథాలయ సంస్థ సెక్రటరీ రమ, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.



తూమకుంట పారిశ్రామిక వాడ వీర్గో పరిశ్రమలో బాయిలర్‌కు వినియోగిస్తున్న కలప

- పచ్చని చెట్లు ఆహుతి
- నిబంధనలకు విరుద్ధంగా వినియోగం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- స్పందించకుంటే పర్యావరణానికి పెనుప్రమాదం

పరిశ్రమల్లో కాలుతున్న కలప..!

హిందూపురం ప్రాంతం సమీపంలో వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల వల్ల ఈ ప్రాంతవాసులకు పూర్తిస్థాయిలో ఉపాధి లభించకున్నా అందులోనుంచి వెదజల్లే కాలుష్యాన్ని మాత్రం ప్రజలు పీల్చి అనారోగ్యం బారిన పడుతున్నారు. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు ఇదే ప్రాంతంలోని ఖాళీ స్థలాల్లో పడేయడంతో కాలుష్యం మరింత అధికం అవుతోంది. ఇది చాలదన్నట్లు పరిశ్రమలకు ఉపయోగించే కలప కోసం పచ్చని చెట్లను నరికి వినియోగించడం వల్ల పచ్చని చెట్లు ఈ ప్రాంతంలో కనుమరుగవుతున్నాయి. దీంతో త్వరలో ఈ ప్రాంతం ఎడారిగా మారిపోవడంతో పాటు కాలుష్యం వల్ల వింత వ్యాధులతో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వస్తుందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆటోలో తీసుకొచ్చి పరిశ్రమలో దించుతున్న కలప

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పారిశ్రామిక వాడలోని కొన్ని పరిశ్రమల్లో ఉపయోగించే బాయిలర్లకు అటవీ సంపదను వినియోగిస్తున్నారు. ప్రతి పరిశ్రమ నిబంధనల మేరకు వారికి కేటాయించిన స్థలంలో 33 శాతం స్థలంలో చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉంది. ఈ నిబంధనను పురం సమీపంలోని పరిశ్రమ నిర్వాహకులు గాలికి వదిలేశారు. 33 శాతం చెట్లను పెంచడం పక్కన పెట్టి ఉన్న చెట్లను సైతం నరికి పరిశ్రమల్లో బాయిలర్లకు వినియోగిస్తున్నారు. తూమకుంట, గోలపురం పారిశ్రామిక వాడలో ఉన్న వీర్గో అట్టల పరిశ్రమతో పాటు మరికొన్ని పరిశ్రమల నిర్వాహకులు చెట్ల నుంచి తీసిన కలపను నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నారు. వీరితో పాటు లేపాక్షి, చిలమత్తూరు మండలంలో ఉన్న గవర్నమెంట్ పరిశ్రమలు సైతం పచ్చని చెట్లను నరికి వారి పరిశ్రమల్లో వినియోగిస్తున్నారు. పరిగి మండలం పైడిటి రోడ్డులో ఉన్న పరిశ్రమలో సైతం పెద్ద ఎత్తున పచ్చని చెట్లను బయిలర్లకు ఉపయోగిస్తున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అధికారులు, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు అక్రమ కలప వ్యాపారానికి ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అటవీశాఖ, పర్యావరణ అధికారులతో పాటు రెవెన్యూ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి పచ్చని చెట్లు పరిశ్రమల్లో కాలుతున్నాయి.

అనుమతుల్లేవని అధికారులకు తెలిసినా..

పరిశ్రమల్లో కలపను ఉపయోగించడానికి అనుమతులు ఉన్నాయా అని పర్యావరణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మునిప్రసాద్‌ను అడిగితే ఆయన అనుమతులు లేవని స్పష్టంగా చెబుతున్నారు. కొన్ని పరిశ్రమ నిర్వాహకులు కలపను ఉపయోగిస్తున్నారని ఆయనకు గతంలో ఫిర్యాదు చేస్తే, పరిశ్రమలను తనిఖీ చేసి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప చర్యలు మాత్రం తీసుకోలేదు. ఇలా వందలాది మహావృక్షాలు పరిశ్రమల్లో కలపగా కాలిపోతుంటే భవిష్యత్తులో అటవీ సందపద కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఈ ప్రాంతం ఏడారి కాక ముందే అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు అధికారులు తొత్తులుగా వ్యవహరించకుండా నిబంధనల మేరకు పర్యావరణ, అటవీశాఖ, రెవెన్యూ, పోలీసు శాఖలు బందంగా ఏర్పడి పరిశ్రమలను ఆకస్మిక తనిఖీ చేయాల్సి ఉంది. అటవీ సంపదను అక్రమంగా వినియోగించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

8న పాపిరెడ్డిపల్లికి జగన్ రాక

- బాధిత కుటుంబానికి పరామర్శ
- బెదిరింపులు, దౌర్జన్యాలపై చంద్రబాబు సమాధానం చెప్పాలి
- వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి
- ప్రజలను భయపెడుతున్న పరిటాల కుటుంబం
- వైసిపి నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈనెల 8వ తేదీన వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి విచ్చేస్తున్నారని వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో తమకు బలం లేకున్నా అధికార బలంతో ఎంపిపి స్థానాలను గెలుచుకునే ప్రయత్నాలను టిడిపి చేసిందని విమర్శించారు. అందుకు వైసిపి నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో కురుబ లింగమయ్యను హత్య చేసారన్నారు. ఉమ్మడి జిల్లాలో తిరిగి ఫ్యాక్షన్‌ను పెంచి పోషించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు అధికారపార్టీ నేతల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తుండటం విచారకరమన్నారు. అధికారపార్టీ నేతల ఆదేశాలకు అనుగుణంగా వారు నడుచుకునే పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. వారు ఆదేశాసిస్తే పోలీసు స్టేషన్లు కూడా మార్చుకుంటారా అని ప్రశ్నించారు. అధికారపార్టీ చేపడుతున్న ఈ అరాచకాలకు ఎండగట్టడంతోపాటు వైసిపి నాయకులు, కార్యకర్తలకు మనోధైర్యం ఇచ్చేందుకు వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈనెల 8వ తేదీన రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి విచ్చేస్తున్నారని తెలిపారు.

జెసిబిల శబ్ధం వింటేనే జనాలకు నిద్రపట్టడం లేదు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

రాప్తాడు నియోజకవర్గంలో రాత్రి సమయాల్లో జెసిబిల శబ్ధం విన్నా నిద్రపట్టని పరిస్థితులు ప్రజల్లో నెలకొందని వైసిపి నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం నాడు వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాప్తాడు నియోజకవర్గం పరిధిలో ఇళ్లను రాత్రిరాత్రికి పడగొడుతుంటే జనం భయపడిపోయే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. తిరిగి నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌ను పురిగొల్పే చర్యలు సరైంది కాదని అన్నారు. అధికారం వచ్చింది ప్రజలకు మంచి చేయడానికేనని తెలిపారు. పరిటాల కుటుంబం ప్రజలకు మేలు చేయకపోగా భయభ్రాంతులకు గురి చేసే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వారి ఆస్తులను లాక్కోవడమే కాకుండా అవినీతి పాల్పడుతున్నారన్నారు. కక్కలపల్లి టమోట మండీల నుంచి పంచాయతీలకు చెందాల్సిన డబ్బులను తమ సొంతానికి వసూలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలకు మంచి చేయడం కోసం అహర్నిశలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కృషి చేసారన్నారు. గతంలో నియోజకవర్గంలో ఉచితంగా బోర్లు వేసామని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్లు కట్టించే పనులను చేపడితే దానిపైనా అనేక ఆరోపణలను పరిటాల సునీత చేయడమే కాకుండా విజిలెన్స్ విచారణ చేపట్టే విధంగా ప్రయత్నించారన్నారు. విజిలెన్స్ విచారణలోనూ డబ్బులు కాంట్రాక్టు సంస్థకే ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని నివేదిక ఇచ్చారన్నారు. ఇప్పటికైనా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించి ప్రజలకు మంచి చేయాలని హితవు పలికారు. ఈనెల 8వ తేదిన వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు విచ్చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండల పరిధిలోని నేలకోట తండాలో పోలీసులు గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గొడవలకు దూరంగా ఉండాలని, పేకాటకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ అందరూ పాటించాలన్నారు. డయల్ 100, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీసు సిబ్బంది, సచివాలయ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పామిడిలో మూతబడిన టెక్స్‌టైల్ పార్కు

టెక్స్‌టైల్ పార్క్‌ను తెరిచేరా..?

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ప్రజాశక్తి-పామిడి

మహిళల ఆర్థిక స్వాలంభనలో భాగంగా చేనేత రంగంలో శిక్షణ ఇచ్చి వారికి సాయం అందించేలా పామిడి ఎన్‌హెచ్-44 వై జంక్షన్ వద్ద 2.77 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.1.76 కోట్ల వ్యయంతో 2004లో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో టెక్స్‌టైల్ పార్క్ కింద మహిళలకు శిక్షణ, పరిశోధన సౌకర్యాలు కల్పించే ఏర్పాటు చేశారు. దీనికి ఏర్పాటు ఆశయం బాగానే ఉన్నా ఆచరణలో పాలకులు, ప్రభుత్వాల నిర్లక్ష్యం అడుగడుగునా కన్పించింది. మహిళా సాధికారతకు ప్రోత్సాహం అందించే దిశగా పయనించాల్సిన ప్రభుత్వాలు ఈ మేరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నిధుల కొరత పేరుతో దీనిని నిర్వహణను మూలనపడేశారు. టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేసిన స్థలం వివాదంలో ఉండడం దీని నిర్వహణకు అదనపు సమస్యగా మారింది. మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చేందుకు టెక్స్‌టైల్ పార్క్‌కు తెచ్చిన సామగ్రిని ఉపయోగించకపోవడంతో అవి ఎందుకూ పనికిరాకుండా మూలనపడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ త్వరలో కొత్త వస్త్ర విధానాన్ని ఆవిష్కరిస్తామని, పామిడిలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మంత్రి చేసిన ప్రకటనతో పామిడి టెక్స్‌టైల్ పార్కు మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే పామిడిలో మూతబడిన టెక్స్‌టైల్ పార్క్‌ను తెరిపిస్తారా.. లేక కొత్తది ఏర్పాటు చేస్తారా అన్నదానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. స్థానిక ప్రజలు మాత్రం మూతబడిన టెక్స్‌టైల్ పార్కును తెరిపించాలని కోరుతున్నారు.

స్థానికులకు ఉపాధి

పామిడిలో మూతబడిన టెక్స్‌టైల్ పార్కును తెరిపిస్తే అందులో శిక్షణ తీసుకుని మహిళలకు ఉపాధి లభిస్తుంది. మండల వ్యాప్తంగా దాదాపు 5 దశాబ్దాలకుపైగా వేల మందికి కుట్టు పరిశ్రమ ఉపాధినిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మూత పడిన టెక్స్‌టైల్ పార్క్‌ను పున:ప్రారంభమైతే పేదల ఉపాధి మెరుగుపడే అవకాశం ఉంది.

రాము,
వస్త్ర వ్యాపారి,పామిడి.

శ్మశాన వాటిక ఏర్పాటుకు భూమి కేటాయింపు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని తు పల్లి పంచాయతీలోని వంకపల్లిలో శ్మశానవాటిక ఏర్పాటుకు అధికారులు భూమిని కేటాయించారు. బుధవారం స్థానిక తాహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బి బాబురావు చేతుల మీదుగా శ్మశాన వాటిక భూమి కేటాయింపు పత్రాన్ని గ్రామస్తులకు అందజేశారు. సర్వేనెంబర్ 766. ఆరో లెటర్ లో 0. 70 ఎకరాల భూమిని శ్మశాన వాటికు కేటాయించామని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, సర్పంచి శివప్పనాయుడు, బిసి వాల్మీకి రాష్ట్ర సెక్రటరీ డి ఆనంద్, చిన్నోడు, గ్రామస్తులు రమణప్ప తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలి : ఎపి రైతుసంఘం



లైనింగ్ పనుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నల్లచెరువు

మండల పరిధిలోని కల్లిపల్లి గ్రామంలో జరుగుతున్న హంద్రీనీవా సుజల స్రవంతి లైనింగ్ పనులను వెంటనే ఆపాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతుసంఘం ఆధ్వర్యంలో లైనింగ్ పనులను బుధవారం అడ్డుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి గల ఏకైక వనరు హంద్రీనీవా సుజల స్రవంతి అని అన్నారు. ఈ కాలువకు లైనింగ్ వేస్తే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. లైనింగ్ పనుల వలన భూగర్భ జలాలు అడుగంటి రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్రంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే జిల్లా సత్యసాయి జిల్లా రైతులకు అన్యాయం చేయొద్దన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పరిధిలో అన్ని గ్రామాలలో గల పిల్ల కాలువలను ఏర్పాటుచేసి వాటి పరిధిలో గల చెరువులను నింపి తర్వాత చిత్తూరు జిల్లాలోని కుప్పంకు నీటిని తీసుకెళ్లాలని అన్నారు. పదివేల క్యూసెక్కుల నీటి సామర్ధ్యంతో కాలువలను వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా లైనింగ్ పనులను ఆపకపోతే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలతో కలసి ఉద్యమాలను ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, కదిరి మండల కార్యదర్శి శంకర రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బడ సుధాకర్ రెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకుడు వివి రమణ, రైతు సంఘం తనకల్లు మండల కార్యదర్శి శివన్న, సిఐటియు వేమన్న. రామకృష్ణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గంజాయి బ్యాచ్‌పై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని కొందరు యువకులు గంజాయి ని తీసుకోవడమే కాకుండా పలువురు మైనర్లకు అమ్ముతూ అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష పోరాట సమితి, భవన నిర్మాణ కార్మిక సంఘం, ఆవాజ్, చేనేత, కల్లుగీత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నాయకులు బుధవారం స్థానిక ఎస్ఐ రమేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలో గంజాయి బ్యాచ్ పలువురుపై దాడి చేస్తూ కలకలం సృష్టిస్తోందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది మంది చేనేత వృత్తిని నమ్ముకొని సోమందేపల్లి గ్రామానికి వలస వచ్చి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. విస్తృతంగా మద్యం అమ్మకాలు, జూదం, ఆన్‌లైన్ మట్కా, మత్తు పదార్థాలకు (గంజాయి) బానిసైన యువకులకు సోమందేపల్లి అడ్డాగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి యువకుల చేతుల్లో గాయపడిన వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అధికారులు స్పందించి సోమందేపల్లిలో శాంతియుత వాతావరణం నెలకొనేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న , జిల్లా కమిటీ సభ్యులు బెస్త కిష్టప్ప , భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు , జిల్లా కమిటీ సభ్యులు రంగప్ప , స్థానిక నాయకులు రవి , కల్లు గీత కార్మిక సంఘం మండల నాయకులు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య , ఆవాజ్ మండల నాయకులు మాబు, షబ్బీర్ , చేనేత కార్మిక సంఘం మండల నాయకులు మాజీ వార్డ్ మెంబర్ వెంకటేశులు, కుమ్మర కిష్టప్ప , నేసే నాగరాజు , స్థానికులు ఆనందప్ప , విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

30న అంబేద్కర్ జీవిత చరిత్రపై నాటకం : కెవిపిఎస్



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - హిందూపురం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర పై ఈ నెల 30వ తేదీన నాటిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కుల వివక్ష పోరాట సమితి నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం సిఐటియు కార్యాలయంలో నాటిక ప్రదర్శనకు సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ, ఏప్రిల్ 30వ తేదీన పట్టణంలోని బిపిఎల్ కాంప్లెక్స్ వద్ద రాత్రి 8 గంటలకు 'సంఘం శరణం గచ్ఛామి' అనే నాటకాన్ని ప్రదర్శించడం జరుగుతుందన్నారు. హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాబృందంచే అంబేద్కర్ జీవిత చరిత్ర నాటకాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించనున్నట్లు తెలిపారు. అంబేద్కర్ అనుభవించిన అంటరానితనం, ఆయన చదువుకున్న చదువులు, ఈ దేశ ప్రజల కోసం ఆయన చేసిన పోరాటం గురించి , కషి తదితర వాటి గురించి ఈ నాటకం ద్వారా ప్రదర్శించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఈ నాటకాన్ని తిలకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు రాయుడు, మారుతి, సరస్వతి, అనితమ్మ, గంగమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి మేట్ల సమస్యలు పరిష్కరించాలి : వ్యకాసం



సమావేశంలో పాల్గొన్న ఉపాధి మేట్లు

ప్రజాశక్తి - గోరంట్ల

ఉపాధి పథకంలో పనిచేస్తున్న మేట్ల సమస్యలు పరిషకరించాలని వ్యకాసం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో మాధవ రాయుని ఆలయ ఆవరణం నందు బుధవారం వ్యకాసం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం మేట్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గం కన్వీనర్ కొండా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దన్న మాట్లాడుతూ తమ హక్కుల సాధనకోసం మేట్లు సంఘటితం కావాలన్నారు. ప్రభుత్వం మేట్లకు రోజుకు ఒక కూలి మీద పది రూపాయలు పారితోషకం ఇవ్వాలన్నారు. మాస్టర్లు పెన్నులు పెన్సిల్లు మెట్లకు ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు మెట్ల సమస్యలపై సోమవారం స్థానిక ఎంపీడీవో ఆఫీస్ వద్ద నిరసన తెలియజేసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం మేట్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు భూముల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - అగళి

మండలంలో హెచ్‌డి హళ్లి గ్రామ శివార్లలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూములనుకలెక్టర్ చేతన్ కుమార్ బుధవారం పరిశీలించారు. అగళి రెవెన్యూ సిబ్బందితోకలిసి ఇండస్ట్రియల్ ఏర్పాటు కోసం ఉన్న భూములను పరిశీలించారు. మడకశిర నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూమిని సర్వే చేయాలన్న ఆదేశాల మేరకు కలెక్టర్ బుధవారం నియోజకవర్గంలో పర్యటించారు. నియోజకవర్గంలో ఎక్కువ స్థలం ఉన్న అగళిమండలంలోని హెచ్‌డి హళ్లి గ్రామ శివారుల ఉన్న స్థలాన్ని గుర్తించారు. అయితే హెచ్‌డి హళ్లి పంచాయతీలోని మూడు గ్రామాలకు చెందిన రైతులు తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వక్క, పప్పాయి, టెంకాయ, మల్బరీ, మామిడి పంటలను సాగు చేసుకుంటూ జీవనం చేస్తున్న తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఈద్గా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని జామియా మసీదులో బుధవారం ఈద్గా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అన్వర్ భాష ఆధ్వర్యంలో ఐదు మసీదుల ముస్లిం సోదరులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఈద్గా నూతన కమిటీ అధ్యక్షుడిగా బంగారు షాపు యజమాని షాషాను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా యూడి బాబు, కార్యదర్శులుగా ఖాసీ, మహబూబ్‌బాషా, మేస్త్రి నజీర్, అక్రంబాషా, తదితరులను ఎన్నుకున్నారు.

ఘనంగా దాసిమయ్య జయంతి

ప్రజాశక్తి - పావగడ

పట్టణంలోని తాలూకా కార్యాలయంలో దేవర దాసిమయ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉప తహశీల్దార్ కుమార్ దేవర దాసిమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి రాజగోపాల్, కార్యదర్శి రాజేష్, బీఆర్సీ రామచేంద్ర, మధుకుమార్, కావ్య, చేనేత సంఘం నాయకులు పాల్గొన్నారు.

వారపు సంత వేలం

ప్రజాశక్తి - అమడగూరు

మండలంలోని మహమ్మదాబాద్ లో ప్రతి గురువారం నిర్వహించే వారపు సంత నిర్వహణకు సర్పంచి సునీతమ్మ ఆధ్వర్యంలో బుధవారం వేలం పాటను నిర్వహించారు. మహమ్మదాబాద్ గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఈ వేలంలో కొక్కంటి పల్లికి చెందిన రామప్ప రూ.1.25లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జానకి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పద్మప్రియ, మండల విద్యాశాఖ అధికారి నాగరాజు నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువు పైన శ్రద్ధ వహిస్తే ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు మాట్లాడుతూ అందరి సహకారంతో ఈ కార్యక్రమం ఇంత ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ నరసింహమూర్తి, సర్పంచి అశ్వర్థ ప్ప, స్థానికులు ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఫర్నీచర్ అందజేత

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం కొత్తపాళ్యం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ధర్మకర్త గోవిందరాజు స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి ఫర్నీచర్ అందజేశారు. 40 ఫైబర్ కుర్చీలు, 2 ఎస్ చైర్స్, 6 టేబుళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంగులవాయి పాళ్యం ప్రభాకర్ రెడ్డి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం

ప్రజాశక్తి - పావగడ

పావగడ తాలూకా పరిధిలోని వైఎన్ హొసకోటే గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరి అమ్మవారికి పంచజ్యోతి ఉత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసందర్భంగా జోడి అచ్చమ్మనహళ్లి కళాకారుల కోలాట, సిద్దాపూర్ కళాకారుల డప్పు వాయిద్యాలతో జ్యోతులు ఊరేగింపు సాగింది.

క్షయపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి కదిరి టౌన్

టిబి నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని టిబి యూనిట్ అధికారి డాక్టర్ తిప్పయ్య ప్రజలకు సూచించారు. కదిరి పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్లను ఆయన బుధవారం సందర్శించారు. టీబీ రోగులకు వారి ఇంటిలో టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టీకా టీబీ ఉందా లేదా అని ముందుగా తెలుసుకోవడానికి ఉపయోగపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లికార్జున, పిపిఎం నాగేంద్ర కుమార్, యుపిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు, ఆరోగ్య ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన

హిందూపురం : వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి, ముస్లిం పర్సనల్ లా బోర్డ్ కు వ్యతిరేకంగా బుధవారం ఎస్‌డిపిఐ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం నాయకులు ఇమ్రాన్ ఖాన్ మాట్లాడుతూ ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా తీసుకువస్తున్న వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : ఎమ్మెల్యే



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

పలు సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను అదే పనిగా తిప్పుకోవద్దని, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వ అధికారులకు సూచించారు. ఓడి చెరువు మండల కేంద్రంలోని ఐటిఐ కళాశాల ఆవరణంలో బుధవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన సమస్యకు అధికారులు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. ఈ ప్రజా గ్రీవెన్స్ లో భూ సమస్యలు అధికంగా వస్తున్నాయనిరెవిన్యూ అధికారులు వీటికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి భూతగాదాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు , స్థానిక ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో విద్యుత్ అధికారుల తమ తీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రతి పనికి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రజల నుంచి పిర్యాదులు అందుతున్నాయని ఇది మంచి పద్ధతి కాదని అసహనం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకుంటే సంబంధిత అధికారులు,సిబ్బందిపై వేటు తప్పదని హెచ్చరించారు. ఓడి చెరువులో ప్రధాన రహదారిపై డ్రయినేజీ నీరు, అక్రమ కట్టడాలు తో ప్రధాన రహదారి కుంచించుకొని పోతోందని, రోడ్ల విస్తరణ చేపట్టి రోడ్లు ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకి విన్నవించారు. బియ్యం తక్కువగా ఇవ్వడం వల్ల రేషన్ కార్డుదారులకు సక్రమంగా బియ్యం అందించలేకపోతున్నామని ఓడిసి, నల్లమాడ ,ఆమడ గూరు మండలాలకు చెందిన పలువురు డీలర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. ఈ విషయంపై సివిల్ సప్లై ,రెవిన్యూ ,పోలీస్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆమడ గూరు, ఓడి చెరువు, నల్ల మాడ మండలాల ప్రజల నుంచి సుమారు 335 అర్జీలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి స్వీకరించారు.

30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయండి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆరోగ్య కేంద్రంగా ఏర్పాటు చేయాలని టిడిపి మండల మైనార్టీ కన్వీనర్ మహమ్మద్ షా కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాలకు సంబంధించిన తహశీల్దార్లు ఎంపీడీవోలు, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

మండలంలోని డబురువారి పల్లి ఎస్సీ కాలనీకి చెందిన కిష్టమ్మ ఇటీవల మృతిచెందింది. విసయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయాన్ని అందజేశారు.

కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

తీర్మాన పత్రాన్ని కలెక్టర్‌కు అందించిన వైసిపి నాయకులు, కౌన్సిలర్లు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కదిరి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ నజీ మున్నిసాపై అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేసిన తీర్మానాన్ని కలెక్టర్ టిఎస్ చేతన్ కు కౌన్సిలర్లు అందజేశారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా 26 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని కదిరి మున్సిపల్ కౌన్సిలర్లు కిన్నెర కళ్యాణ్, రంగారెడ్డి తదితరులు కలెక్టర్‌కు బుధవారం అందజేశారు. కదిరి మున్సిపాలిటీ గిరిని ఎలాగైనా కైవసం చేసుకోవాలని అధికార పార్టీ, ఉన్న పరువును కాపాడుకోవాలని వైసిపి నాయకుల ప్రయత్నాలతో కదిరి మున్సిపాలిటీ పీఠంపై జిల్లాలో ఉత్కంఠ నెలకొంది. చైర్ పర్సన్ తో పాటు మెజార్టీ సభ్యులు గతంలో వైసిపి ద్వారా ఎన్నికైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో త్వరలోనే అవిశ్వాస తీర్మానం పై మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.



అవిశ్వాస తీర్మాణ పత్రం అందజేస్తున్న నాయకులు

ప్లాస్టిక్ విక్రయదారులపై చర్యలు



ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుంటున్న నగర పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-పెనుకొండ

ప్లాస్టిక్ అమ్మకం దారులపై నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం నగర పంచాయతీ పరిధిలోని పలు దుకాణాలపై కమిషనర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో 122.5 కేజీల ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకుని రూ.21వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యాక్ట్ 2016 ప్రకారం ప్లాస్టిక్ వాడకం నిషేధించబడిందన్నారు. అందులో భాగంగా మున్సిపల్ పరిధిలోని పలు షాపులపై దాడులు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తున్న 7 దుకాణయజమానులను జరిమానా విధించామన్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. నిబంధనలను అతిక్రమించిన షాపు దారులు, వినియోగదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి నగర పంచాయతీ అభివృద్ధికి ప్రజలు దుకాణదారులు సహకరించాలని ఆయన కోరారు. ఈదాడుల్లో మున్సిపల్ కమిషనర్ తో పాటు సి. రామప్రసాద్, ఈ.వినోద్ కుమార్, ఈ. పవన్ కుమార్, కె. వెంకటరాముడు, కరణ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రక్షణ కల్పించండి'



కలెక్టరేట్ ముందు కూర్చొన్న బాధితురాలు లక్ష్మీదేవి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

తనకు టిడిపి కార్యకర్తలతో ప్రాణహాని ఉందని వారి నుంచి రక్షణ కల్పించాలని అమడగూరు మండలం మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన వాసి రాజారెడ్డి భాగ్యలక్ష్మి దేవి కోరారు. ఈ మేరకు ఆమె కలెక్టరేట్ ముందు బైఠాయించి తన ఆవేదనను వ్యక్తం చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తనకు గ్రామంలో ఉన్న 20 సెంట్లు భూమిలో షెడ్డు వేసి వృద్ధులకు అనాథల పిల్లలకు తన వంతు సేవలందించాలని నిర్ణయించుకున్నానన్నారు. అందులో భాగంగా చారిటబుల్ ట్రస్టు రిజిస్టర్ కూడా చేయించానని తెలిపారు. షెడ్డు వేయాలంటే ఖర్చుతో కూడుకున్నందున తనకు ఉన్న భూమిలో మూడు సెంట్లు విక్రయించి ఆ డబ్బుతో షెడ్డు నిర్మించ తలపెట్టగా రాము, వెంకటేశు, నరేష్ అనే టిడిపి కార్యకర్తలు మంగళవారం వచ్చి మంగళవారం షెడ్డు కట్టకూడదని అడ్డగించారని ఆరోపించారు. అంతేకాకుండా తనపై దౌర్జన్యం చేసి చెప్పుతో కొట్టి దాడి చేశారని ఆరోపించారు. షెడ్డు నిర్మాణం నిలిపివేయకుంటే రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి లింగమయ్యకు పట్టిన గతే పడుతుందని హెచ్చరిస్తున్నారని వాపోయారు. తమకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అండదండలు ఉన్నాయని బాహాటంగా మాట్లాడుతూ చంపితే దిక్కెవరు అంటూ బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయంపై అమడగూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన ఫలితం కన్పించలేదని అన్నారు. తాను ఏ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తిని కాదన్నారు. జిల్లా స్థాయి అధికారులు తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కేశవయ్య

ప్రజాశక్తి - పెనుకొండ

రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెనుకొండ మాజీ ఎంపీపీ కేశవయ్య బుధవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి, సవిత, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నర్సింహాయాదవ్, డైరెక్టర్లతో మంత్రి అచ్చెన్నాయుడు స్వీకారం చేయించారు. పెనుకొండ నియోజకవర్గం నుంచి మాజీ ఎంపీపీ కేశవయ్య డైరెక్టర్ గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలువురు యాదవ సంఘం నాయకులు బీబనుకొండ నియోజకవర్గం తెలుగుదేశం నాయకులు పెద్ద ఎత్తున ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. యాదవ సంఘం నాయకులు మంత్రి సవిత, కేశవయ్యను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, పట్టణ పార్టీ శ్రీరాములు యాదవ్, వడ్డే శ్రీనివాసులు, బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న కేశవయ్య

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు బుధవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ లో ఆర్టీసీ ఎమ్‌డికి 38 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించామన్నారు. అయితే యాజమాన్యం తమ సమస్యల పరిష్కరించడంలో విఫలం చెందిందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగులు అనారోగ్యంతో సెలవు పెడితే ఆ సెలవు రోజులకు కూడా వేతనం ఇవ్వాలని, నైట్ అవుట్ అలవెన్స్ లు గతంలో మాదిరే ఇవ్వాలని కోరారు. అన్ని కేటగిరీలలో ఉద్యోగోన్నతులు కల్పించాలని, విద్యుత్ బస్సులు కొనుగోలు చేసి నిర్వహణ బాధ్యతలు ఆర్టీసీకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా రీజనల్ అధ్యక్షుడు శ్రీరామ్ నాయక్, జిల్లా కార్యదర్శి షబ్బీర్, రీజనల్ ఉపాధ్యక్షురాలు తిరుపతమ్మ, డిపో అధ్యక్షులు శివ శంకర్, నాయకులు గంగులయ్య, శివారెడ్డి, విజయలక్ష్మి, స్వర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధన

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ధర్మవరం బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మహాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు మల్లికార్జున ప్రభాకర్ పెద్దన్న తదితరులు మండల పరిధిలోని పలు గ్రామాలలో, పట్టణంలోని ముఖ్యమైన కూడలిలలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నైపుణ్యం, అనుభవం గల అధ్యాపకులచే విద్యా బోధన జరుపుతున్నామని, ప్రతి సంవత్సరం మంచి ఫలితాలను సాధిస్తున్నామని చెప్పారు. ఉత్తమ విద్యాబోధన చేసే ప్రభుత్వ కళాశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.



ప్రచారం చేస్తున్న కళాశాల సిబ్బంది

నేరాలు ఘోరాలు

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. కదిరి పట్టణంలోని వలిసాబ్ రోడ్ లో నివాసము ఉండే దాదా పీర్‌కు, వాణి స్ట్రీట్ లో నివాసము ఉంటూ చెట్ల వ్యాపారము చేసుకొని జీవనము చేసే షేక్ సమీవుల్లా మధ్య పాత గొడవలు ఉండేవన్నారు. ఈ నేపథ్యంలో షమీవుల్లాను హతమార్చాలన్న ఉద్దేశ్యంతో దాదాపీర్ ముందస్తుగా తెచ్చుకున్న కత్తితో షమీవుల్లాపై దాడికి యత్నించాడన్నారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాదా పీర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని మేజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ ఇవ్వడంతో దాదాపీర్‌నుకదిరి సబ్ జైలుకు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని సిరా బైపాస్ రోడ్డు చేనేపల్లి క్రాస్ వద్ద బుధవారం మధ్యాహ్నం బైక్ కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలు అయ్యాయి.కనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన వెంకటరామప్ప ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వెంకటరామప్పకు గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -రొద్దం

మండలంలోని కందుకూర్లపల్లికి చెందిన వడ్డే మనోజ్ (24) బుధవారం గ్రామ సమీపంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన మనోజ్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కాలనీలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం పట్టణంలోని సిల్క్ కాలనీలో బుధవారం తెల్లవారు జామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. టూ టౌన్ ఎస్ఐ బ్రహ్మానంద రెడ్డి సిబ్బందితో పాటు వన్ టౌన్, రూరల్ పోలీసులతో కలిసి సిల్క్ కాలనీలో ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు లేని నాలుగు ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను సీజ్ చేశారు. అనంతరం ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించించారు. శక్తి యాప్ పై వివరించారు. నేరాలకు పాల్పడితే పడే శిక్షలను తెలియజేశారు. అదే విధంగా నేరస్తులకు సహకారం అందించడం కూడా నేరమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ పార్టీ పోలీసులతో పాటు పోలీసులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల వార్షిక రుణ ప్రణాళిక

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు వార్షిక రుణ ప్రణాళికపై అవగాహన కల్పించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం జయచంద్ర, సీసీలు హరి, కృష్ణమూర్తి, రత్నమ్మ, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పోటీల్లో 'చిన్మయ' చిన్నారుల ప్రతిభ

ప్రజాశక్తి - హిందూపురం

జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన యురేకా ఆన్ లైన్ సైన్స్ ప్రయోగాల జిల్లా స్థాయి పోటీల్లో పట్టణంలోని చిన్మయ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పర్యావరణం, సుస్థిర అభివృద్ధి అనే అంశంలో 8వ తరగతి విద్యార్థిని పూర్ణిక రాయల్ జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. మూఢనమ్మకాలు, శాస్త్రీయ దృక్పథంఅనే అంశంలో 9వ తరగతి విద్యార్థిని అచ్యుత రెండవ స్థానాన్ని కైవసం చేసుకోగా, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో 9వ తరగతి విద్యార్థిని సుహానా నిలిచింది, వారిని బుధవారం పాఠశాల యాజమాన్యం, జనవిజ్ఞాన వేదిక సభ్యులు అభినందించి, ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్ పోటీలలో విద్యార్థులు పాల్గొనడం ద్వారా వారికి విజ్ఞాన పరంగా మంచి అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భీమరాజు, ప్రిన్సిపల్ సరళ, వైస్ ప్రిన్సిపల్ మహేష్ బాబు, సైన్స్ కోఆర్డినేటర్ మారుతి, కార్యాలయ ఇన్‌ఛార్జి చంద్రశేఖర్ యాదవ్, జన విజ్ఞాన వేదిక హిందూపురం అధ్యక్షులు రామకృష్ణ తదితరులు ప్రతిభా విద్యార్థులను అభినందించారు.

నీటి తొట్టెల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - రొద్దం

వేసవిలో పశువులకు దాహార్తి తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ నిధులతో చేపట్టిన నీటితొట్టెల నిర్మాణ పనులను ఎంపీడీవో రాంకుమార్, ఏపీవో సూర్యనారాయణ బుధవారం ప్రారంభించారు. మండలంలోని బక్సాంపల్లిలో నిర్మిస్తున్న నీటితొట్టె నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ అనిల్ కుమార్, శివకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలమురళి, అంజినప్ప, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




పనులను ప్రారంభిస్తున్న ఎంపిడిఒ, ఏపీవో

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజా దర్బార్–కార్యకర్తలు, ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్‌తో పాటు హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు అంజినప్ప తదితరులు పాల్గొన్నారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజలు కార్యకర్తలు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యల గురించి శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నింటినీ కచ్చితంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 9నెలలు గడిచిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికంటే అధికారంలో ఉన్నప్పుడే మనపై బాధ్యత ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. పార్టీలో పదవులు ఇతర పనులు జరగడం లేదన్న ఆవేదన కొంతమందికి ఉందన్నారు. అయితే అధికార పార్టీలో ఉన్నప్పుడుకొన్ని పరిమితులు ఉంటాయని కార్యకర్తలు వాటిని అర్థం చేసుకోవాలని సూచించారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. ఇకనుంచి ప్రతి ఒక్కరు తమ వార్డు, గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లాలన్నారు. వారి సమస్యలను సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

నియోజకవర్గంలో వివిధ కారణాలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 12మందికి మంజూరైన రూ.7.68 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, బీమినేని ప్రసాద్ నాయుడు, కమతం కాటమయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువార్డుల ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు.